
# ఒక రంగసాని కత



ఒక వూరలట ఒక రాజున్నాడట. ఆ రాజుకి నలుగురు కొడుకులట. నలుగురుకొడుకులయితే- ఒక బోగరంగసాని వుందట. దేశదేశాలనుండి రాజులొచ్చి ఆ బోగరంగసాని దగ్గిర కెళ్ళాలని రావడమూ- జేగంటమీద దెబ్బకొట్టి- వెయి రూపాయలు మూటపెట్టి-తిరగ ఎలిపోడమూ- లేకపోతే పసిడి గంట మీద దెబ్బకొట్టి-వంద రూపాయలు మూటగట్టి లోనకెళ్ళడమూ- ఏదో ఒకటి అని అనుకుండోరట!

అందరు ఎళ్ళడమూ బోడిగుండులతోటి ఎలిపోరావడమూ- లోపుకెళ్ళడమూ బోడిగుండులతోటి ఎలిరావడమూ అవుతుందట! సిగ్గొట్టిపోయి ఎవులి దేశాలకాలు ఎలిపోడమూ జరుగతందట!

ఒక్కలూ బోగరంగసానికి సూడలేదట!?

అయితే, ఈ నలుగురు కొడుకులూ... నలుగురు దగ్గిర సేరి.. రతి రహస్యాలు తీసి పెద్దోలు ముగ్గురూ బోడిగుండులతోటి తిరిగెలిపొచ్చినారట!

ఆ సిన్నోడు కంసాలోడి దగ్గిర సేరినాడట. సేరి, ఆ కూపీలల్ల తీసాడట. తీసి, ఇలగ... నేస్తమంటే నేస్తమని నేస్తరికం కట్టినాడట. ఆడు... కంసాలోడు బోగరంగసానికి వస్తువులు సేస్తాడట. వారానికి ఏడుతొడుగుల నగలు సేయిస్తాదట ఆవిడ. పెట్టి నగ మరి పెట్టదట!? వారానికి ఏడు తొడుగుల నగలు సేయిస్తుండి అవి ఇవ్వడము... ఇస్తే... ఆ సెలి కత్తెలు అక్కడ్నుంచి పట్టుకోని ఎలిపోడము... గని మరి ఆడికీ తెలీదు..!

అప్పుడు అన్నాడట. రాజు సిన్నకొడుకు. 'నేస్తమూ... ఆ లోనకెళ్ళిన పరిస్థితి సెప్పండి... తరువాత మాట్లాడు కుందుము...'

'నేస్తమూ... మీరు ముందల జేగంటమీద దెబ్బకొట్టి వేయి రూపాయలు మూటపెట్టి- లోనికెళ్ళగాన- మంచమొకటి... మాయ మంచ మొకటి వుంటాది! ఆ మాయ మంచం మీద సూది మొన మోపితే నాలుగు కోలునుంచి నలుగురు సెలికత్తులు లెగుస్తారు! ఒకదాయి బుఱ్ఱగీసెస్తాది! ఒకదాయి పిండి సుక్కలూ మసి సుక్కలూ ఎట్టెస్తాది! ఒకదాయి కాలుకి పిని కట్టెస్తాది! ఒకదాయి ఈడిసెస్తాది!' అన్నాడు కంసాలి. అని 'ఇలాగే అందరొచ్చి ఎలిపోతన్నారు.



అవతలకి మరెవులు ఎళ్ళడము తెల్దు...' అని చెప్పినాడు.

'అయితే... నేస్తమూ ఆ నలుగురికి ఎలగో గెలుస్తామండి. గెలిసిన తరవాత అవతలో..?'

'అవతల... ఒక మరల యంత్రం వున్నాదండి నేస్తము. ఆ మరల యంత్రము దాటితే... రొండు పేద్ద పాములున్నాయండీ... ఆ పాములు దాటితే పేద్ద సెరువున్నాదండీ... ఒట్టి వూబి సెరువు! ఆ సెరువు దాటితే... అవతల ఒడ్డుకి.. నాకేటి తెలీదండీ నేస్తము...' అనీసినాడట.

'...అక్కడి వరకు సెప్పావు... సేన... ఆ తర్వాత నీనెలాగు వుపయోగించుకోవాలో వుపయోగించుకుంతాను...' అనుకోని.. ఆలోసించాడట ఒక రేతిరల్లా.. నిద్రమానుకోని.

'... ఏటి సెస్తే ఈ మాయమంచం దాటుతాను? పిచ్చికుక్కలున్నాయి.. ఆటిని ఎలగదాటుతాను. ఈకుక్కలకెలగ? ఆ పాములకెలగ? మరకత్తెర కెలగదాటుతాను?' అని అలోసించి వుపాయం సేసినాడట. సేసి, ఒక నిమ్మకాయ కొన్నాడట. మంచి బాకు, కైజారు కొన్నాడట. ఒక పోకచెక్క కొన్నాడట. మరి రొండు కోడిగుడ్డులు కొన్నాడట. రొండు మాంసం ముక్కలు కొన్నాడట. సంచిల ఎట్టుకున్నాడట.

ఇకన, బయల్దేరినాడట! బయల్దేరెళ్ళి- జేగంటమీద దెబ్బకొట్టి, వెయి రుపాయలు మూటపెట్టాడు. ఎళ్ళినోళ్ళందరూ మాయ మంచం మీద దర్జాగ కూచుంటారు గదా?! ఈడు నిమ్మకాయ ఏసేడట... కూర్చోకుండా. ఒక కోడు మీదనుంచి లెగిసి ఒక సెలికత్తె బుర్రగీసీడానికి తడిమెస్తందట. దాన్నొక్క ఏటు ఏసాడట! ఇంకో కోడు సెలికత్తె అయివచ్చిం దట... పిండిసుక్కలు మసిసుక్కలు ఎట్టీ డానికి! దాన్నొక్క ఏటు ఏసాడట. ఇంకోదాయి కట్టీడానికి తాడొట్టుకొని ఎలిపోవస్తుంటే- ఈడ్సీ డానికి ఇంకోదాయి వచ్చిందట.. అందరికి నరికేనాడట!

మాయ మంచం దాటేడు!

ఇకన, మరయంత్రము... అదే అడకత్తెర వున్నాది. అడకత్తెరలోన పోకచెక్క పెట్టేడట! అది కొట్టి కొట్టి బంకయిపోయిందట!

అటింక ఎళ్తే - పాములు బుస్సులు కొడ తన్నాయట. ఆటికి కోడిగుడ్లు ఇచ్చినాడట! అవతల పిచ్చికుక్కలున్నాయుట. ఆటికి మాంసం ముక్కలు ఏసినాడట. ఇవన్నీ అయి పోయినాయి...

ఆలోపుకి.. సెరువుకి ఎలగెల్తాడు? ఒట్టి వూబి! ఏమిసెయ్యిడమూ? ఎలగ ఎళ్ళడమూ?

ఎవులూ రారు? ఏటి సెయ్యాలని అట్టి ఆలోసించాడట!? ఆలోసించగా-అలోసించగా...' సరే బగమంతుడా... నువ్వే వున్నావను కోని... ఈత మొదలెట్టి ఎల్తోటికి... ఆ లోపున కిందన వూబి కదా?.. వూబిలోన వూపిరి ఎలపలేపోతన్నాడట!
ఏటి సెయ్యడం? ఎలగ దాటడం అనుకుండీ సరికి-
... ఈ కంసాలోడు ఆ గట్టువరకు ఎల్లోడుకదా.. ఆడు సెప్పాడట..
'నువ్వు బోగ రంగసానీ అని కేకేసినావంటే ఆలసెలికత్తెలు అవతలకి దాటిస్తారు...' అని.
అయితే ఈడేమో ఈత ఈదలేకపోనాడు.
'బోగరంగసానీ' అని కేకేసినాడట.
కేకేస్తే,
'కంసాలోడే గావాల నగలొట్టుకోని



వచ్చినాడ'ని ఆలోచ్చి అవతల ఒడ్డుకు దాటించీసినారట.
సరే, ఇకన ఎళ్ళినాడట!?...
'... అమ్మో ఎవులో వొచ్చిసినారు.. ఏటి? ఏ రాజుకొడుకో?... ఇవన్నీ దాటుకోని ఎలిపొచ్చీసినాడు... ఎలగ... ఏటి?'అన్నారట సెలికత్తెలు.
అప్పుడు రంగసాని అన్నాదట.. 'పోని వస్తేరానీ...' అనీసి పరుపులు పరిసిన దానికి అన్నాదట.
'నువ్వు ఇవేళ నాలాగ వేషమేసుకోని ఎళ్ళు' అన్నాదట.
ఆ పరుపులు పరిసినదాయి ఎళ్ళిందట.
ఈ పిల్లడికట... ఈ రాజు కొడుక్కి... కొంచెం పరకాయ ప్రవేశం వచ్చునట. ఈ పరుపులల్లా సిక్కురు బక్కురు సిక్కురు బక్కురు సేసేనాడట! సేసీసి... ఆం ... పరుపులు పరిసినదాయి వచ్చింది... దీనిపని సెస్తాననీసి... పరుపంతా సిక్కుసేసీసి..

అన్నాడట-
'బోగరంగసానీ... జేగంటమీద దెబ్బకొట్టి వెయి రూపాయలు పెట్టాను. మాయ మంచం దాటాను. మరకత్తిరి దాటినాను. రెండు విషపు నాగులు దాటాను. రెండు కుక్కలు దాటినాను. మరి ఒక వూబి సెరువు దాటినాను. నువ్వను కోని వచ్చిసరికీ నీ మొకమూ సూపించవు... ఈ పరుపు ఇలగే వుంచుతారా?'అన్నాడట.
ఆ పరుపులు పరిసినదాయిగదా... గబగబా పరుపులు పరిసీబోతందట.
'నువ్వు పరుపులు పరిసిన దానవు, నీవు బోగరంగసానివా? అని రొండు గుద్దులు గుద్దినాడట. గుద్దతోటికి అది పారిపోయిందట. 'అమ్మో... మహాతెలివైనోడులాగున్నాడు...' అనుకోని.
అ తరువాత దీపందాయి వచ్చిందట. అయితే దీపం దాయి వస్తన్నాదని తెలుసుకున్నాడట. తెలుసుకోని ఆ దీపంలోకి ఎలిపోయినాడట. ఎలిపోయి మినుకూ... మినుకూ... సేస్తన్నాడట.
'బోగరంగసానీ.. జేగంటమీద దెబ్బకొట్టి వెయి రూపాయలు పెట్టాను. మాయమంచం దాటాను. మరకత్తిని దాటినాను. రెండు విషనాగులు దాటాను. రెండు కుక్కలుదాటినాను. మరి ఒక వూబి సెరువు దాటినాను. నువ్వనుకోని వచ్చిసరికీ నీ మొకమూ సూపించవు...
ఈ దీపం ఇలగే వుంచుతారా?' అని అడిగినాడట. 'దీపమయినా సరీగ ఎలిగించుకోడం తెలీదా? ఈ సీకటిలోన నీమొకం సూడాలనా... ఇన్ని బాధలు పడుకోని వచ్చినాన'ంటే-
అలగనీసరికి ఆ దీపాల ముట్టించినదాయి... దాని పని అదిగదా... దీపం ఎత్తుకుంతదట అది.!?
'నువ్వు దీపందానవు, బోగరంగసానివా?' అను కోని దనికి నాలుగు ఏసినాడట. అది పరి గెట్టుకోని పారిపోయిందట. 'అమ్మో... మహా ఘటికుడయున్నాడు' అనుకోని. రంగసాని ఎల్లమంటే 'అమ్మో... మీము మరెళ్ళము' అన్నారట పరిసారికలు.
'సరే, పిలే అతన్ని...' అని రంగసానే ముస్తాబయి వచ్చిందట. ఎనకపెట్టుకోని కూచుందట. కూచుంటే అన్నాడట..
'బోగరంగసానీ... జేగంటమీద దెబ్బకొట్టి వెయి రుపాయలు పెట్టాను. మాయమంచం-మరకత్తిరి దాటినాను. రెండు విషనాగులూ రెండుకుక్కలు దాటినాను. వూబిసెరువు దాటినాను. మరి బుడ్డీల దాన్నీ పరుపుల దాన్నీ దాటినాను... ఎన్ని దాటొస్తే ఏటిలాభం? అయినా బోగరంగసానికయితే నాతో మాట్లాడ్డం అసేయుమూ. బోగరంగసాని ఏనుకున్న

రవికా... నువ్వయినా రవ్వంత మాట్లాడవే?!..
అన్నాడట.
పరకాయ ప్రవేశం వచ్చును గదా రవికలో దూరిపోయి...' నీనేటి సేస్తాను?
నావల్ల ఏటవుతాది?' అన్నాదట.
'అన్నా...' నీను ఇన్నాళయిన ఇంతడబ్బిచ్చి కుట్టించుకున్నాను. నీను ఇన్నాళయిన ఏసుకుంతన్నాను... నాతోటి మాట్లాడక... ఇప్పు డొ[illegible]న రాజుకొడుకుతోటి ఆడుతావా?! అని ఆ రవిక తీసి జల్లీసిందట.
ఆ బోగరంగసాని...
ఈడు వూరుకుంతాడా? మళ్ళీ అన్నాడట.
ఎన్నిదాటు కొచ్చాడో అన్నీ సెప్పి...
'బోగరంగసాని ఏసుకున్న హారమా నువ్వయినా మాట్లాడవా?' అనీసి అంటే-
'నీనేటి సేస్తాను? నావల్లేటవుతాది?' అని హారమంటే - రంగసాని అన్నా' అనీసి ఆహారం తీసి జల్లీసి..!
ఈడు వూరుకోడు కదా? మళ్ళీ అన్నాడట.
ఎన్నిదాటుకొచ్చాడో అన్నీసెప్పి.. 'బోగ రంగసాని కట్టుకున్న కోకా.. నువ్వయినా మాట సెప్పవా?' అనీసి అంటే-
'నీనేటి సేస్తాను? నావల్లేటవుతాది?' అని కోకంటే - రంగసాని ఆకోక ఇప్పీసి జల్లీసి వొచ్చి ఆ కాలు మీద పడిపోయింది!
'నీను బోగరంగ సానినని మాటేగాని.. పురుషుడు ఎలాటోడో నాకు తెలీదు..
అలాటిది నువ్వే నాదినిలొాన గెలిసావు' అని అతన్ని పెళ్ళి సేసుకొని... 'వీరుడివి నువ్వు' అని మెచ్చుకోని... అతనితోటి హాయిగ బతుకుతన్నాది!
ఇంకేటి? కత అయిపే.

